సాక్షి మంచిర్యాల

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



గి'రాఖీ' సందడి

జిల్లాలో రాఖీ పండుగ సందడి మొదలైంది. రాఖీల కొనుగోళ్లతో దుకాణాల్లో రద్దీ ఏర్పడుతోంది. విభిన్నమైన రాఖీలను మహిళలు, యువతులు కొనుగోలు చేస్తున్నారు. 9లో▸



మళ్లీ పులి హల్‌చల్

జిల్లా అడవుల్లో మళ్లీ పులి కదలికలు మొదలయ్యాయి. మూడు రోజులుగా నీల్వాయి అటవీ రేంజ్ కాటేపల్లి, నీల్వాయి, గొర్లపల్లి బీట్ అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తోంది. 10లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /25.0

వాతావరణం

ఉదయం వేళ ఆకాశం పాక్షికంగా, రాత్రివేళ పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. పడమర దిశగా గాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

గులాబీలో అసమ్మతి ముళ్లు !

- టికెట్ దక్కని ఆశావహుల్లో అసంతృప్తి
- ఏం చేయాలనేదానిపైనా మంతనాలు
- ద్వితీయ శ్రేణి నాయకుల తీరుతో తిప్పలు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు పార్టీలోనే ఇబ్బందులు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గులాబీ గూటిలో అసంతృప్తి 'ముళ్లు' బయటపడుతున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు దక్కడంతో పార్టీలో ఉన్న నాయకులు తమ పరిస్థితి ఏమిటనే ఆలోచనలో పడ్డారు. గత రెండ్రోజులుగా మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలను కలుస్తున్నారు. ఆదివారం కూడా మంచిర్యాల పట్టణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. తన అనచరులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులతో సమావేశం ఏర్పాటు చేస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత కొంతకాలంగా ఆయన పార్టీ వ్యవహారాల్లో అంటీముట్టనట్లుగా ఉన్నారు. గతంలో ఆయనకు ఎమ్మెల్సీ, రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కుతుందని ఆశించినా ఎలాంటి పదవీ రాలేదు. దీంతో ఈసారి ఎన్నికల్లో ఎవరికి ఆయన మద్దతు ఉంటుందనేది కీలకంగా మారనుంది. ఇటీవల నియోజకవర్గ పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించి టికెట్ ఆశించిన రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ చైర్మన్ పుస్కూరి రామ్మోహన్ రావు ఒకింత నిరాశలోనే ఉన్నట్లు చెబుతున్నారు. ఆయన వర్గం ఇప్పటికీ పార్టీలో ఎమ్మెల్యే గ్రూప్‌తో విభేదించి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎవరైనా నాయకులు పార్టీ వీడుతారా..? లేక మళ్లీ పార్టీకి విధేయత ను ప్రదర్శిస్తారా..? అనేది తేలాల్సి ఉంది.

చిన్నయ్యకు శేజల్ గండం




చిన్నయ్య

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకుల్లో కొంతమేరకు అసంతృప్తి ఉంది. టికెట్ రానప్పటికీ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ పార్టీకే పని చేస్తానని చెబుతున్నారు. మూడు పర్యాయాలు టికెట్ ఆశించి భంగపడ్డారు. తప్పనిసరిగా టికెట్ వస్తుందనే ఆశ ఉన్నప్పటికీ రాకపోవడంతో ఆయన వర్గం అసంతృప్తిలోనే ఉంది. బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి మండలాల నాయకుల్లో ఒకింత వ్యతిరేకత ఉంది. మరోవైపు ఆరిజిన్ డెయిరీ సీఈవో శేజల్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోరాడుతోంది. ఆమె ప్రచారంలో పాల్గొంటే పరిస్థితులు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. మరోవైపు నిఘా వర్గాలు ఆయనపై వ్యతిరేకత ఉన్నట్లు ఓ నివేదిక ఇచ్చినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

చెన్నూరులోనూ...




సుమన్

చెన్నూరు నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బలంగా ఉన్నప్పటికీ కింది స్థాయి కార్యకర్తల్లో అసంతృప్తి ఉంది. మందమర్రి, రామక్రిష్టాపూర్, చెన్నూరు పట్టణాల్లో వ్యతిరేకత ఉంది. సీనియర్ నాయకులు కొందరు లోపల అసమ్మతితో రగిలిపోతున్నారు. సమయం చూసి, తమ బలం చూపించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకరిద్దరు పార్టీ మారేందుకు కూడా సిద్ధపడినట్లు తెలు స్తోంది. చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలమైన నాయకత్వం దొరికితే కొందరు అటు వైపు వెళ్లేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

ఖానాపూర్‌లో జాన్సన్‌నాయక్‌కు..


జాన్సన్‌నాయక్


రేఖానాయక్

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్నేహితుడు, ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్‌కు సొంత పార్టీ నుంచే వ్యతిరేకత మొదలైంది. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను కాదని జాన్సన్‌కు టికెట్ ఇవ్వడంతో ఎమ్మెల్యే అనుచరులు గుర్రుగా ఉన్నారు. ఇక్కడ పోటీలో దిగుతామని ప్రకటించారు. కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడంతోపాటు పార్టీలో చేరేందుకు దాదాపు అంతా సిద్ధమైంది. దీంతో బీఆర్‌ఎస్‌లో భారీగా చీలిక ఏర్పడే అవకాశం ఉంది. అక్కడ ఆయన రేఖానాయక్‌తో పోటీని తట్టుకుని నిలబడాల్సి ఉంది.

మంచిర్యాల నుంచి పోటీలో బీసీలు



మంచిర్యాల నియోజకవర్గంలో బీసీలకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్ ఉంది. బీసీ నాయకులు టికెట్‌పై ఆశలు పెట్టుకుని భంగపడ్డారు. వీరిలో మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్‌తోపాటు పలువురు పార్టీలో అసంతృప్తిగా ఉన్నారు. వీరిలో ఎవరైనా పార్టీ మారుతారా అనేది వేచి చూడాలి. ఇక అన్ని పార్టీల బీసీ నాయకులంతా ఉమ్మడిగా ఓ అభ్యర్థిని బరిలో నిలుపుతామని చెప్పడం గమనార్హం. అంతేకాక కొందరు స్వతంత్రంగానైనా పోటీ చేస్తామని అంటున్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: ఎన్నికల సంవత్సరం అయినందున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పూర్తి వివరాలతో ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల ధ్రువీకరణ, ఓటింగ్ శాతం పెంపు, నూతన ఓటర్ల నమోదు, 2వ ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం నిర్వహణ, తదితర అంశాలపై ఎన్నికల అధికారులను అడిగి వివరాలు సేకరించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 23 కేంద్రాల పేరు మార్పు, 45 కేంద్రాల చిరునామా మార్పునకు ప్రతిపాదించినట్లు తెలిపారు. జిల్లాలో ఫారం–6 ద్వారా 9,121, ఫారం–8 ద్వారా 6,123 ఓటరు కార్డులు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఓటరు జాబితాకు సంబంధించి వచ్చిన 462 ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సబావత్ మోతీలాల్, బి.రాహుల్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'


చెక్కు అందజేస్తున్న విప్ సుమన్

నస్పూర్: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. శనివారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, జిల్లా కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ బి.రాహుల్‌తో కలిసి దివ్యాంగుల ఆసరా పింఛన్ ప్రొసీడింగ్స్, మైనార్టీ బంధు రూ.లక్ష ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ, పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్ రూ.3016 నుంచి రూ.4016కు పెంచడంతోపాటు మైనార్టీ బంధు పేరిట రూ.లక్ష ఆర్థిక సహాయం అర్హులకు అందిస్తున్నామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 27 మందికి అందిస్తామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీ రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. చెన్నూర్ నియోజకవర్గంలో 15మంది కార్యదర్శులకు నియామకపు ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే కాంగ్రెస్‌కు వేసినట్లే'


సమావేశంలో మాట్లాడుతున్న అభిమన్యు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులు, వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించామని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేసిందేమీ లేదని, ఆ పార్టీకి ఓటు వేస్తే కాంగ్రెస్ పార్టీకి వేసినట్లేనని మహారాష్ట్రలోని ఔసా ఎమ్మెల్యే అభిమన్యు పవార్ విమర్శించారు. మంచిర్యాల అసెంబ్లీకి ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే అభిమన్యు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లితో కలిసి మంచిర్యాలలో విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన 15 మంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారని, అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రజనీష్ జైన్, కృష్ణమూర్తి, గుండా ప్రభాకర్, తులా ఆంజనేయులు, మోటపలుకుల తిరుపతి, పానుగంటి మధు, పట్టి వెంకటకృష్ణ, జోగుల శ్రీదేవి, పత్తి శ్రీనివాస్, రంగ శ్రీశైలం, గోపతి రాజయ్య, హరిగోపాల్, పూదరి రమేశ్ పాల్గొన్నారు.

'పెద్దన్నయ్యగా అండగా ఉంటాం'


డీసీపీ సుధీర్‌కు రాఖీ కడుతున్న విద్యార్థులు

మంచిర్యాలక్రైం: 'మేమున్నాము మీకు పెద్ద అన్నయ్యగా అండగా ఉంటాం' అని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ విద్యార్థినులకు అభయమిచ్చారు. స్థానిక సీఐ రాజు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం షీ టీమ్, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీపీకి, పోలీస్ అధికారులకు విద్యార్థినులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ షీ టీమ్ పూర్తి స్థాయిలో భద్రత కల్పిస్తోందని తెలిపారు. సమస్య ఎదురైనప్పుడు అన్నయ్యలా అండగా ఉంటూ భద్రత కల్పిస్తామని, నిర్భయంగా ఫిర్యాదు చేయాలని అన్నారు. 100డయల్, షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700కు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ రాజు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్, షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్సై హైమ పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి..


చెన్నూర్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్యే దివాకర్‌రావు

- మరింత అభివృద్ధి చేస్తా
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- మండలాల్లో ఆశీర్వాద సభ


ఇందారం వద్ద గజమాలతో స్వాగతం

చెన్నూర్/జైపూర్/భీమారం: ఒకసారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని రూ.500 కోట్లతో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. చెన్నూర్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ రెండోసారి కేటాయించిన తర్వాత మొదటిసారిగా చెన్నూర్‌కు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు జైపూర్ మండలం ఇందారం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. గజమాల వేసి ఖడ్గం అందజేశారు. జైపూర్, భీమారం మీదుగా చెన్నూర్ అంబేద్కర్ చౌక్ వరకు పెద్ద ఎత్తున ఆశీర్వాద ర్యాలీ నిర్వహించారు. వానమామలై వరదాచార్యులు, తెలంగాణ తల్లి, మహాత్మా జ్యోతిభా పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంతాల్లో నిర్వహించిన ఆశీర్వాద సభలో ప్రభుత్వ విప్ సుమన్ మాట్లాడుతూ చెన్నూర్ బీఆర్‌ఎస్, కేసీఆర్ కంచుకోట అని, 82శాతం ప్రజలు బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తారని, సర్వేలన్నీ అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో 94కు పైగా సీట్లు సాధించి హ్యాట్రిక్ కొడతామని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధి యజ్ఞం ఆగదని అన్నారు. నియోజకవర్గంలో 18 బ్రిడ్జిలు నిర్మించామని, త్వరలోనే 50పడకల ఆస్పత్రి ప్రారంభిస్తామని చెప్పారు. భారీ వర్షాలకు నీట మునిగిన పంటలపై ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించామని అన్నారు. రాష్ట్రంలోని పేదలకు సేవ చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీ దండె విఠల్, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎంపీపీ గోదారి రమాదేవి, జెడ్పీటీసీలు మేడి సునిత, బుక్యా తిరుమల, బీఆర్‌ఎస్ నాయకులు సరోత్తమ్‌రెడ్డి, రిక్కుల మధుకర్‌రెడ్డి, బల్మూరి అరవిందర్‌రావు, మున్సిపాలిటీల చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, చెన్నూర్, కోటపల్లి, మందమర్రి, జైపూర్, భీమారం, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా


మొక్కలు నాటుతున్న డీఆర్‌డీఓ శేషాద్రి, అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్, సర్పంచ్ లక్ష్మి, విద్యార్థులు

- నియోజకవర్గంలో గుడిపేటకు ప్రత్యేక స్థానం
- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా నియోజకవర్గం అభివృద్ధి పథంలోనే కాదు ఆదర్శంగా ముందుకు సాగుతోందని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శనివారం హాజీపూర్ మండల గుడిపేటలో ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ గుడిపేట గ్రామ పంచాయతీ నేడు ప్రతి అంశంలోనూ అభివృద్ధి సాధిస్తూ ప్రజాసంక్షేమంలోనూ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ బి.శేషాద్రి, అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్, ఎంపీడీఓ అబ్దుల్‌హై, సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ ముడిమడుగల విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కలెక్టర్..

నూతన గ్రామ పంచాయతీ ఆవరణలోనే కాకుండా పంచాయతీ పరిసరాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. కలెక్టర్ సంతోష్ డీఆర్‌డీఓ శేషాద్రి, సర్పంచ్ లక్ష్మితో కలిసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, ప్రకృతి వనాన్ని సందర్శించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కూడా పంచాయతీ పరిసరాల్లో మొక్కలు నాటారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూఎస్‌పీసీ నాయకులు

నస్పూర్: ఉపాధ్యాయ, విద్యారంగంలో సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని యూఎస్‌పీసీ(ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ) రాష్ట్ర కమిటీ సభ్యులు అశోక్‌కుమార్, లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది జూన్ 30తో మొదటి వేతన సవరణ ఒప్పందం ముగిసిందని, రెండో వేతన సవరణ కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి చెల్లింపు, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ వెంటనే విడుదల, సీపీఎస్ విధానం రద్దు, హెల్త్‌కార్డుల జారీ వంటి పలు సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సెపెంబర్ ఒకటిన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన మహాధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూఎస్‌పీసీ రాష్ట్ర బాధ్యులు భుజంగరావు, శ్యాం, సుధీర్, అంజన్‌బాబు, జిల్లా బాధ్యులు గోళ్ల రామన్న, రమేశ్, లక్ష్మణ్, రాజవేణు, జయకృష్ణ, కుమార్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా


భీమినిలో మొక్కలు నాటుతున్న రాహుల్

బెల్లంపల్లిరూరల్: ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. శనివారం బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఓటరు జాబితా ప్రత్యేక కేంద్రాన్ని పరిశీలించారు. జాబితాలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బెల్లంపల్లి తహసీల్దార్ సుధాకర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన మొక్కలు

భీమిని: కోటి మొక్కల కార్యక్రమంలో భాగంగా శనివారం భీమిని, కన్నెపల్లి మండలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణతోపాటు పల్లెప్రకృతివనంలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పెద్దపేట, బిట్టూర్‌పల్లి, రాజారాం పోలింగ్ కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. డీఎల్‌పీఓ ఫణీధర్, జెడ్పీటీసీ సత్యనారాయణ, తహసీల్దార్లు భీకరణదాస్, దత్తారావు, ఎంపీడీఓలు రాధాకిషన్, సబ్దర్‌ఆలీ పాల్గొన్నారు.

హరితహారంలో భాగస్వామ్యం కావాలి

- మొక్కల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత
- కలెక్టర్ బాదావత్ సంతోష్
- బెటాలియన్‌లో మొక్కలు నాటిన కలెక్టర్, డీసీపీ


బెటాలియన్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్, డీసీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్వతంత్ర భారత వజ్రోత్సవాలను పురస్కరించుకుని తెలంగాణకు కోటి మొక్కల హారం ప్రతిష్టాత్మకంగా చేపడుతుండగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, డీఆర్‌డీఓ శేషాద్రిలతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. దాదాపు వెయ్యి మొక్కలను సిబ్బందితో కలిసి నాటి నీళ్లు పోశారు. కలెక్టర్ మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని తెలిపారు.

ప్రత్యేక ఓటరు శిబిరం సందర్శన

హాజీపూర్ మండలం నంనూర్–గుడిపేట గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు శిబిరాన్ని కలెక్టర్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు జాబితాలను పరిశీలించి సూచనలు చేశారు. 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ బి.శేషాద్రి, నాయబ్ తహసీల్దార్ హరిత, గ్రామ సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి, జెడ్పీ కో ఆప్షన్ నహీంపాషా, ఎంపీడీఓ అబ్దుల్‌హై, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు

నస్పూర్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ సంతోష్ తెలిపారు. శనివారం నస్పూర్‌లోని సీతారాంపల్లి గోదావరినదిలో జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌తో కలిసి 65 వేల చేపపిల్లలను వదిలారు. కలెక్టర్ మాట్లాడుతూ గోదావరినదిలో 22 లక్షల చేపపిల్లలు, చెరువులు, కుంటలతోపాటు వివిధ రకాల నీటి వనరుల్లో దాదాపు రెండు కోట్ల చేపపిల్లలు విడుదల చేస్తామని వివరించారు.

'నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్'


మాట్లాడుతున్న నాయకుడు మనోహర్

పాతమంచిర్యాల: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని పీవైఎల్ రాష్ట్ర నాయకులు కూర్మ మనోహర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో శనివారం విద్యార్థులు, నిరుద్యోగులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కంటితుడుపు చర్యగా 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రకటన చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 23 వేల టీచర్‌పోస్టులు ఖాళీ ఉన్నాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. జంబో నోటిఫికేషన్ వేసి ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్, కృష్ణ, రాజేష్, రఘురాం, బానేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం


కేజీబీవీలో మొక్కలు నాటుతున్న డీఆర్‌డీఓ

నస్పూర్: రాష్ట్ర ప్రభుత్వం రాబోయే భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడానికి పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి తెలిపారు. శనివారం కోటి వృక్షోత్సవంలో భాగంగా పట్టణంలో కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటారు. డీఆర్‌డీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు సంధ్యారాణి, పూదరి కుమార్, చిదం మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



చెట్టుకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు బయలుదేరింది. కెరమెరి ఘాట్ రోడ్డుపై నుంచి వెళ్తుండగా బస్సు రోడ్డుదిగి చెట్టుకు ఒరగడంతో ప్రమాదం తప్పింది. లేదంటే బస్సు లోయలో పడిపోయి ప్రాణనష్టం జరిగిఉండేది. డ్రైవర్ అతివేగంగా బస్సు నడపడం వల్లే ఘటన చోటు చేసుకుందని ప్రయాణికులు పేర్కొన్నారు.

దుండగులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



బాలుడిని పరామర్శిస్తున్న కేశవ్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని ఎడవెల్లి గ్రామానికి చెందిన బాలుడు ఉదయ్‌కుమార్‌పై జూలై 12న దాడికి పాల్పడిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేగుంట కేశవ్‌రావు మాదిగ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు చాంద్‌పాషాతో కలిసి బాలుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి జరిగి 50 రోజులు కావస్తున్నా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. బాలుని చికిత్స, కుటుంబ పోషణకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, బాధిత కుటుంబానికి దళితబంధు, గృహలక్ష్మి పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.

పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య

పెంచికల్‌పేట్(సిర్పూర్): మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లోడ్‌పల్లి గ్రామానికి చెందిన కావుడే గంగారాం (50) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య గౌరుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రక్షణసూత్రాలు పాటించాలి

నస్పూర్: సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా అన్నారు. శనివారం ఆర్కే 7 గనిపై ఉద్యోగులకు వ్యక్తిగత భద్రత, బాధ్యతలపై అవగాహన కల్పించారు. నా భద్రత నా బాధ్యత-నాభద్రతే నా కుటుంబ భద్రత అనే నినాదాన్ని ప్రతీ ఉద్యోగి అనుసరించాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గని లోపలికి దిగి పని స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్‌రావు, ఎస్ఎంటీసీ మేనేజర్ విజయ్‌కుమార్, ఆర్కే 7 గ్రూపు ఏజెంట్ ఎం.రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్, పిట్ కార్యదర్శి మెండె వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

నయనం.. ప్రదానం



- ఒకరిగా మరణించి... ఇద్దరిగా జీవించు
- నేత్రదానం చేద్దాం.. చూపునిద్దాం
- జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు (ఫైల్)

మంచిర్యాలటౌన్: వ్యక్తి మరణించిన తర్వాత కళ్లు దానం చేస్తే ఇద్దరి జీవితాల్లో వెలుగును ప్రసాదిస్తాయి. దాతల కళ్లు పునర్జన్మను సంతరించుకుని అంధకారాన్ని పారదోలే కాంతిపుంజంగా మారుతాయి. అందుకే సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు. అంతటి ప్రధానమైన కళ్లను మరణించాక మట్టిపాలు చేసేకంటే దానం చేయడం ఉత్తమం. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ఈ నెల 25న ప్రారంభం కాగా సెప్టెంబర్ 8వరకు నిర్వహించనున్నారు. కంటి చూపులేని వారికి ఒకరి నుంచి సేకరించిన రెండు కళ్లలో ఒకటి అమర్చినా, అలా ఇద్దరికి చూపు వచ్చే అవకాశం ఉందని, నేత్రదానానికి ప్రజలు ముందుకు రావాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రచారం కల్పిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 2009 నుంచి 2022 వరకు దాదాపుగా 864 మంది నేత్రదానానికి ముందుకు వచ్చారు.

కార్నియా అంధత్వం

కంటి ముందు భాగంలోని నల్లటి భాగాన్ని కప్పి ఉంచే పొరను కార్నియా అంటారు. ఏటా వందల మంది కార్నియా అంధులుగా మారుతున్నారు. వీరిలో 50 శాతం మంది యువతీ, యువకులు, చిన్నపిల్లలే. విటమిన్-ఏ లోపం, పౌష్టికాహార లేమి, ప్రమాదాలు, గాయాలు, శస్త్ర చికిత్సలతో వచ్చే ఇన్‌ఫెక్షన్లతో కార్నియా అంధత్వం వస్తుంది. మనిషికి 50 ఏళ్లు దాటాక కళ్లలో శుక్లాలు వస్తాయి. శస్త్రచికిత్సల ద్వారా చూపు వస్తుంది. కార్నియా అంధత్వానికి నేత్రాల కార్నియా మార్పిడే మార్గం. కార్నియా దెబ్బతిని చూపు కోల్పోయిన వారు రోజురోజుకూ పెరుగుతున్నా, నేత్రదానం చేసేవారు పెరగడం లేదు. నేత్రదానానికి ముందుకు వచ్చిన వారిలో కొందరు మృత్యువాత పడిన సమయానికి వారి కళ్లను దానం చేయలేకపోతున్నారు.

కార్నియా సేకరణ ఇలా..

నేత్రదానం అనేది 15–20 నిమిషాల్లో పూర్తయ్యే సామాన్య ప్రక్రియ. మరణించిన వారి నుంచి కార్నియాను మాత్రమే తీసుకుంటారు. మనిషి మరణిస్తే ఆరు గంటల్లోగా శరీరం నుంచి కార్నియాను సేకరించాలి. ముందుగా 'ఐ' బ్యాంక్ వారికి సమాచారం ఇవ్వాలి. వారు వచ్చేలోగా నేత్రదాత రెండు కనురెప్పలను మూసివేసి, దూది లేదా మెత్తటి వస్త్రాన్ని వాటిపై కప్పి ఉంచాలి. మృతదేహాన్ని ఫ్రీజర్ బాక్స్‌లో పెట్టినా ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. వైద్యులు సేకరించిన కార్నియాను 24 గంటల్లోగా అర్హులైన ఇద్దరికి అమరుస్తారు. కాగా, మాక్ కాఫ్‌మన్ ద్రవపదార్థంలో కార్నియాను భద్రపరిస్తే 28 రోజుల్లోగా వాడుకోవచ్చు.

ఎవరు అర్హులు

ప్రమాదవశాత్తు, గుండె జబ్బులు తదితర దీర్ఘకాలిక జబ్బులతో మరణించిన వారు, సహజ మరణం చెందిన వారు నేత్రదానం చేయడానికి అర్హులు. ఏ వయసు వారైనా, కంటి అద్దాలు ధరించిన వారైనా, షుగర్ వ్యాధిగ్రస్తులు, అధిక రక్తపోటు ఉన్న వారైనా మరణానంతరం నేత్రదానం చేయవచ్చు. నేత్రదానం తర్వాత కృత్రిమ కళ్లను మృతుడికి అమర్చుతారు. దీని ద్వారా ఎలాంటి వికృతం ఉండదు. అంతిమ సంస్కారాలకు ఇబ్బంది ఉండదు. 18 ఏళ్లు నిండిన వారు వయస్సుతో సంబంధం లేకుండా నేత్రదానం చేయవచ్చు.

నేత్రదానం చేయాలనుకునే వారు ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రుల్లో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

ఆసుపత్రి	ఆప్తాలమిక్ అధికారి	సెల్ నంబర్
మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి	జి.శంకర్	98495 78938
లయన్స్ కంటి ఆసుపత్రి, బెల్లంపల్లి	ఎల్.ఎస్. మల్లేశ్	94404 45067
రిమ్స్, ఆదిలాబాద్	జే.లింగేశ్	98665 16995
రిమ్స్, ఆదిలాబాద్	కె.విజయ్ కుమార్	92477 50829
రిమ్స్, ఆదిలాబాద్	తథాగత్	90004 84201
జిల్లా ఆసుపత్రి, నిర్మల్	సీహెచ్. లక్ష్మీకాంత్	94403 85964
శేషన్న చెన్నవార్ కంటి ఆసుపత్రి, మావల	రంజిత	99634 78753
గోపాలరావుపటేల్ కంటి ఆసుపత్రి, ముధోల్	సందీప్	08752-254296
జిల్లా ఆసుపత్రి, ఆసిఫాబాద్	బి.వెంకటేశ్	98491 62623

అవగాహన కల్పిస్తున్నాం



నేత్రదానానికి ప్రజలు ముందుకు వస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు సకాలంలో సమాచారం ఇస్తేనే నేత్రాల సేకరణకు అవకాశం ఉంటుంది. సేకరించిన కళ్లను హైదరాబాద్‌లోని సరోజిని దేవి కంటి ఆసుపత్రికి తరలించాల్సి వస్తుంది. ఐ బ్యాంక్ లేకపోవడంతో నేత్రాలను సేకరించినా భద్రపర్చలేక పోతున్నాం. వేసవిలో కళ్లను సేకరించిన మూడు గంటల్లోపు భద్రపర్చాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ వచ్చినందున కళ్లను భద్రపరిచేందుకు అవకాశం ఉంది.

– డాక్టర్ యశ్వంత్, మంచిర్యాల జిల్లా అంధత్వ నివారణ అధికారి

ఆదాయపు పన్ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి

- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

నస్పూర్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికుల ఆదాయపు పన్ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆర్కే 5 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఏటా వేల కోట్ల రూపాయలు పన్నుల రూపేణా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తుందని, కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణికి రావాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, ఏరియా ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్‌రెడ్డి, ఏరియా కార్యదర్శులు నాతాడి శ్రీధర్ రెడ్డి, కాసెట్టి నాగాశ్వర్‌రావు, కేంద్ర కమిటీ సభ్యులు మాదాసి రవీందర్, నాయకులు సతీశ్, రమేశ్, కమలాకర్, శ్రీకాంత్, సంపత్, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ త్వరగా అందించాలి



మాట్లాడుతున్న గ్రామస్తులు

కాసిపేట(బెల్లంపల్లి): పునరావాసంలో ప్లాట్ల కేటాయింపు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జాప్యం చేయకుండా త్వరగా అందించాలని దుబ్బగూడెం గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరేళ్లుగా సర్వేలు, విచారణ పేరుతో రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన జాబితాను విచారణ పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో వార్డు సభ్యురాలు గోనె శ్రీలత, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోనెల శ్రీనివాస్, ఆర్‌అండ్‌ఆర్ కమిటీ సభ్యులు బూరుగుపల్లి రమేశ్, దుర్గం శ్రీనివాస్, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి నాగపురి శ్రీనివాస్, గ్రామస్తులు బిజ్జారి రమేశ్, ఎండీ రఫీ, తిరుమల పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా సెక్యూరిటీ గార్డుల నియామకం

- రూ.లక్షలు వసూలు చేస్తున్న నిర్వాహకులు
- ప్రశ్నార్థకంగా సింగరేణి ఆస్తుల పరిరక్షణ



మందమర్రిలోని ఎస్‌అండ్‌పీసీ కార్యాలయం

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల నియామకం ఇష్టారీతిగా జరుగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. కొత్తగా నియామకమైన వారి నుంచి సెక్యూరిటీ నిర్వాహక సంస్థ లక్షల్లో వసూలు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి శిక్షణ లేకుండానే ఇటీవల కొత్తగా ముగ్గుర్ని ఉద్యోగంలోకి తీసుకుని పోస్టులు వేయడంతో సంస్థ ఆస్తుల రక్షణపై పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో విజిలెన్స్ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నియామకం ఎలా అంటే ...

సింగరేణిలో రిటైర్మెంట్ అయిన సెక్యూరిటీ గార్డుల స్థానంలో నూతన రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో ప్రైవేట్ గార్డుల సంఖ్య పెరుగుతోంది. సింగరేణిలో భూములు కోల్పోయిన కుటుంబాలు, మాజీ ఉద్యోగుల పిల్లలకు నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టాల్సి ఉండగా రాజకీయ పలుకుబడి, యూనియన్ ప్రతినిధుల పైరవీలకు సెక్యూరిటీ సంస్థల నిర్వాహకులు, అధికారులు మామూళ్లకు కక్కుర్తిపడి నిబంధలను తుంగలో తొక్కి ఇష్టారీతిగా నియామకాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మందమర్రి ఏరియాలో పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులు 130, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు 154 పోస్టులకుగానూ సుమారు 250 మందిని నియమించుకున్నారు.

పూర్తిగా మస్టర్లు చేయలేకపోతున్నాం

ఇదిలా ఉండగా ఇదివరకు నియామకమైన గార్డులు పరిమితికి మించి ఉండడంతో వారికి నెలకు పూర్తిస్థాయిలో మస్టర్లు రావడం లేదని వాపోతున్నారు. ఏరియాలో 154 పోస్టులకు గానూ 250 మందిని నియమించుకున్నారు. దీంతో అందరికీ డ్యూటీలు రావాలనే ఉద్దేశంతో రొటేషన్ పద్ధతిలో డ్యూటీలు ఇవ్వడం వలన నెలలో పూర్తిస్థాయిలో మస్టర్లు దొరకడం లేదని పలువురు గార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ మందిని ఇష్టారీతిగా నియమించుకోవడం వల్ల పూర్తిస్థాయిలో మస్టర్లు లేక వేతనం కూడా తక్కువ వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విజిలెన్స్ విచారణ జరిపించి అక్రమంగా నియామకమైన వారిని తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పాతవారి స్థానంలోనే..

మందమర్రి ఏరియాలో పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులు 130, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు రెండు సెక్యూరిటీ సంస్థలు కలిసి 154 మందిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇటీవల ముగ్గురు పాత సెక్యూరిటీ గార్డులకు వేరే ఉద్యోగాలు రావడంతో విధులకు రావడంలేదు. వారి స్థానంలో నిబంధనల ప్రకారమే కొత్త వారిని తీసుకున్నారు. – నగునూరి రవి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్, మందమర్రి ఏరియా

ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న జీఎం సంజీవరెడ్డి

జైపూర్(చెన్నూర్): ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి అన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఇందారం ఐకేఓసీపీపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మూడు ఏరియాల్లో 30 వేల మొక్కలు నాటామన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేఓసీపీ పీవో శ్రీనివాస్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, డీజీఎం పర్సనల్ అరవిందర్ రావు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, గని మేనేజర్ బ్రహ్మాజీరావు, పర్యావరణాధికారి హనుమాన్‌గౌడ్, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, డీజీఎం రవీందర్, సర్వే అధికారి ఈ.రవీందర్, సీనియర్ పీవో కాంతారావు, టీబీజీకేఎస్ నాయకులు రత్నాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆగని భూ ఆక్రమణలు

- కూల్చిన చోటే వెలిసిన సిమెంట్ పోల్స్



ప్రభుత్వ భూమిలో పోల్స్ వేయిస్తున్న వ్యక్తులు

నస్పూర్: పట్టణ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు ఆగడంలేదు. నస్పూర్ శివారు సర్వే నంబరు 64 ప్రభుత్వ భూమిలో ఇటీవల కొందరు రెడీమేడ్ ప్రహరీ నిర్మించారు. ఈ నెల 15న 'యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు 16న అక్రమ నిర్మాణాన్ని తొలగింపజేశారు. జాతీయ రహదారిని ఆనుకుని ప్రభుత్వ భూమి ఉండడంతో రూ. కోట్లలో ధర పలుకుతోంది. దీంతో సదరు వ్యక్తులు ఇటీవల అదే భూమిలో మళ్లీ సిమెంటు పోల్స్ వేసి కబ్జాకు తెరలేపారు. ఆక్రమణదారులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే తరచూ ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

అదుపుతప్పి లారీ బోల్తా

ఆసిఫాబాద్‌రూరల్: అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ నుంచి పత్తి విత్తనాల లోడ్‌తో మహారాష్ట్రకు బయలుదేరిన లారీ జిన్నింగ్ మిల్లు సమీపంలో బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

బీజేపీలోకి డాక్టర్ రఘునందన్?



రఘునందన్

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన డాక్టర్ రఘునందన్ బీజేపీలో చేరుతున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో కొంత కాలంగా కంటి వైద్యుడిగా సేవలందిస్తున్నారు. ఖమ్మంలో జరిగే సభలో అమిత్‌షా సమక్షంలో రఘునందన్‌తో పాటు పట్టణానికి చెందిన అర్జున్, సత్యనారాయణ బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలిసింది.

శాంప్లింగ్ మజ్దూర్ పరీక్ష వాయిదా

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలో నేడు నిర్వహించాల్సిన శాంప్లింగ్ మజ్దూర్ పరీక్షను కొన్ని అనివార్య కారణాల వల్ల సెప్టెంబర్ 10 కి వాయిదా వేసినట్లు శ్రీరాంపూర్ డీవైజీఎం పర్సనల్ అరవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న ఉదయం 10 గంటలకు సీసీసీ సింగరేణి ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తామని, ఇది వరకే ఇచ్చిన హాల్ టికెట్లతో హాజరు కావాలని సూచించారు.

'జీవో 22 అమలు చేయాలి'



మాట్లాడుతున్న మహేందర్

నస్పూర్: రాష్ట్ర ప్రభుత్వం జీవో 22ను వెంటనే అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) శ్రీరాంపూర్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్ ఓసీపీపై కాంట్రాక్ట్ కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతనాల పెంపుదలకు పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- డీజీపీ అంజనీకుమార్
- ఉత్తమ అధికారులకు సన్మానం



పీపీ ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: నిషేధిత మత్తుపదార్థాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావుతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ప్రజలకు భద్రత విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పోలీసు సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారుడి పట్ల గౌరవంగా వ్యవహరించి సమస్యను త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని తెలిపారు. కేసుల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సైబర్ నేరాలపై ప్రజలకు నిత్యం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, అప్రమత్తం చేయాలని సూచించారు. చిన్నపిల్లలపై అఘాయిత్యానికి పాల్పడే వారికి త్వరితగతిన చట్టపరంగా శిక్షలు పడేలా చూడాలన్నారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండు నెలల్లో 8 కేసుల్లో 15 మంది నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ ప్రసాద్, ఎస్సై సాగర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ లైజన్ ఆఫీసర్లు ఎండి బషీరొద్దీన్, బాబాజీలను శాలువలతో సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సీఐలు బుద్దేస్వామి, నాగరాజు, శ్రీనివాస్, సురేశ్, నరేందర్, సాదిక్ పాషా, మల్లేశ్, ఎస్సైలు దీకొండ రమేశ్, మధుకర్, లక్ష్మీప్రసన్న, డీపీవో ఏవో శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ ఉత్పత్తి లక్ష్యాలు పెంచాలి



కాసిపేట 2గనిపై జీఎం మనోహర్

కాసిపేట(బెల్లంపల్లి): అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి రోజువారీ ఉత్పత్తి లక్ష్యాలను పెంచాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ సూచించారు. కాసిపేట 2 గనిని శనివారం సందర్శించారు. గనిలోకి దిగి పనిస్థలాలను పరిశీలించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించి మొదటి సారి గనిని సందర్శించిన జీఎంను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేకే గ్రూప్ ఏజెంటు రాందాస్, ఏఎస్‌వోఎం రవీందర్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, రక్షణాధికారి సంతోష్‌రావు, పిట్ ఇంజినీర్ రఘు, జూనియర్ సర్వే అధికారి ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి

కాసిపేట: మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ సూచించారు. శనివారం మండలంలోని సోమగూడెం కాసిపేట రహదారి పక్కన వాగు సమీపంలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, ఏఎస్‌వో రవీందర్, కేకేఓసీ పీవో రమేశ్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సీఎంవోఏఐ అధ్యక్షుడు పైడీశ్వర్, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.